



ఖంగు ఖంగుమని దగ్గింది పార్వతమ్మ. ఆ దగ్గుకి నరనరాలు తెగిపోయినట్లు బాధపడింది. పాతబడిపోయిన గదిగోడలు ఆ దగ్గుకి ధ్వనించాయి. ఆ గోడలకు ప్రతిగామున్న శరీరం వూగిపోయింది. ప్రాణాలు కళ్ళలోకి వచ్చినట్లనిపించింది. ఆ ఎముకలగూడు ఆ వూపుకి తట్టుకోలేక గిలగిల లాడిపోయింది. ఊపిరి ఎగతోసుకు వస్తోంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆమె అధీనంలో లేవు. కాసేపు అలాగే అవి ఎలా వూపితే అలా వూగింది. కాసేపటికి సర్దుకొన్నట్లనిపించి, శరీరానికి ప్రతిగా మున్న నులకమంచంపై వాలింది. 'ష్! భగవాన్!' అలసటగా నిట్టూర్చింది. ముఖమంతా చెమటపట్టుతోంది. కొంచెం పక్కకు ఒత్తిగిలింది. మంచానికి ప్రతిగా మున్న పెళ్ళినాటి పట్టుచీరె ఆమంచంపై పక్కగా వేసుకొంది. ఆ చీరె ఒక పక్కగా కొంచెం పైకెత్తి, ముఖంపై తుడుచుకొన్నది. ఆ చీరె ఆమెకు పెళ్ళినాటి ముచ్చటలన్నీ వినిపిస్తూంటూంది. ఆనాటి జీవితాన్ని కళ్ళముందర చూపుతూంటుంది. అందులో ఎన్ని మధుర క్షణాలు దొర్లిపోయాయో అనుక్షణం గుర్తుచేస్తూంటుంది. ఆ మధుర స్మృతులలో జరిగే ప్రతినిముషాన్ని మధురంగా మారుస్తూ వుంటుంది.

ఆ చీరెలోనే ఎన్నో పెళ్ళిళ్ళు, పేరంటాలు వెళ్ళొచ్చింది. క్రమంగా ఆమె ఆరోగ్యంతో బాటు అదీ శిథిలమై పోయింది. ఒకసారి నీరసంగా చూసి నవ్వుకొన్నది. నేడో రేపో అన్నట్టున్న తన ప్రాణం, 'ఇక నేను నీ బరువు మోయలేను' అన్నట్టు తనకింద నలిగిపోతున్న పట్టుచీరె, చిరిగి ముక్కలైపోతున్నా దాని అందం మాయలేదు. మామిడిపండు రంగు చెదిరిపోలేదు. ఆరంగు ఆయనకెంతో యిష్టం. స్వయంగా ఎన్నికచేసి కొన్నారట ఆ చీరె. ఎన్నిసార్లు చెప్పారో ఆ మాట. తనకూ విన్నమాటవలెనే అనిపించేది. ఎన్నిరంగులు చూసినా ఏదీ నచ్చేదికాదట. ఆ చీరెకోసం ఎన్నో కొట్లకి తిరిగారట. రోజూ ఆ చీరె కట్టుకోమనేవారు 'ప్రతి రోజూ ఒకే చీరె కట్టుకుంటారా ఎవరైనా?' నవ్వేది తను.

'ఎవరిష్టం కాదది' అనేవారు నా యిష్టం నీయిష్టం ఒకటేగా అన్నట్లు.

'అయితేమటుకు—అంతా ఏదో పిచ్చివుందని అనుకొంటారు' అనేది. 'అనుకోనీ! లేనివాళ్ళకు పిచ్చివుందని అనుకొనేవాళ్ళే పిచ్చివాళ్ళు' అనే య

నిర్లక్ష్యంగా. 'ఇది మరీ బాగుంది' అని అప్పటికి దాటేసేది. నిజానికి ఏ పేరంటానికో వెడుతున్నప్పుడు — అదయినా కాస్త ఆడంబరంగా జరుగుతున్న చోటికి వెడుతున్నప్పుడు తప్ప ఆనా చీరె కట్టుకొనేది కాదు. ఉన్నదే ఒక్కటి. దాన్ని కాస్త అప్పుడే పాతబడనివ్వటం యిష్టముండేదికాదు. ఆయన బాధపడలారని ఆమాట పైకనేది కాదు. తనమీద వున్న పిచ్చిప్రేమతో ఎక్కడన్నా అప్పుచేసి కొత్తది పట్టుకొస్తారేమోనని భయం. ఏదో వున్నంతలో తిని ప్రశాంతంగా సాగుతున్న జీవితంలో అప్పులకల్లోలం రేగుతుందేమోనని భయం. ఆ కల్లోలం రేగకుండానే, ప్రశాంతంగా వున్న సంసార సాగరంలో ఆ రాయి పడకుండానే నిశ్చింతగా, వున్నంతలో యిన్నాళ్ళూ సంతృప్తిగా గడిచిపోయింది. 'కాలమెలాగో గడుస్తే చాలు' అనుకొనేట్లు గడవలేదు. ప్రతినిముషం ఆనందంగానే గడిచిపోయింది.

ఆ ఆనందాతిశయాలు కొనసాగకుండా ఈ రోగం పట్టుకొంది. రెండేళ్ళనుంచి శరీరాన్ని, గుంటని పీల్చి పిప్పిచేస్తోంది. అయినా తగ్గే సూచనలేమి లేవు. చల్లగా సాగుతున్న సంసారాన్ని కాళ్ళ బొడవటానికి వచ్చిన రోగం అలా ఎలా తగ్గుతుంది? రోగం తగ్గదు, ప్రాణం పోదు. అదొక నరకం. నరకం అని ఎక్కడో వర్ణిస్తారు — ఇంతకంటె వేరే నరకం ఏముంటుంది? అనుభవించేవన్నీ యిక్కడ అనుభవించాల్సిందే! తెలిసి అనుభవిస్తారు కొందరు, తెలియక అనుభవిస్తారు కొందరు. అనుభవించటం మటుకు తప్పదు. నవ్వుకొంది నవ్వుగా తనలోతానే.

ఎక్కడ తిరుగుతున్నారో ఏమో? భోంచేశారో లేదో ? వారానికి వచ్చేది ఒక్కరోజు శెలవు. ఆ రోజు ఇంటిపట్టున వుండి విశ్రాంతి తీసుకోటానికి వుండదు. బతుకుపోరం వారంరోజులు కుర్చీకి అంటుకుపోయి, రక్తాన్ని చెమట బిందువులుగా మార్చి అరిసుక్కి, ఫైళ్ళకు అంకితం చేస్తే వచ్చేది, ఒకరోజు శెలవు వారానికి. ఆ ఒక్కరోజు మటుకు విశ్రాంతి తీసుకోటానికి ఎక్కడుంటుంది మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మానవుడికి ? వారం రోజులు పెళ్ళి అక్కా పెట్టిన పనులన్నీ ఆ రోజు నెత్తిన వేసుకోక తప్పదు. [illegible] అయినా కాని పోయినా, అవతారం మార్చేసినట్లు మరునాటికల్లా కట్టి వేస్తే ఒక గుమాస్తా అయి ఆఫీసుకి వెళ్ళాల్సిందే. మళ్ళీ ఆదివారంనాడు తన నిజరూపంతో బయల్దేరాలి. ప్చ! ఏమిటో ఈ బతుకులు ? కడుపు కోసం, కడుపుకి పుట్టిన సంతానం కోసం ఎన్ని బాధలైనా సహిస్తాడు. తనసుఖం చూసుకోకుండా ఎందరినైనా సుఖపెట్టగలడు. ఆ రెండూ చల్లగా వుంటే చాలు. శరీరమలసిపోయినా లక్ష్యపెట్టకుండా తనవిధి తను నిర్వహిస్తాడు. మెదడూ మొద్దుబారిపోయినా విశ్రాంతియివ్వ యిచ్చగింపడు. ఏమిటో! ఈ బతుకు బొంగరాన్ని ఈరెండూ ఒక త్రాడులా పెనవేసుకుపోయి గిరగిరా తిప్పుతున్నాయి. ఈ త్రాడు లేనిదే ఆ బొంగరం తిరుగదు. తాడయినా బొంగరం కోసరమేగ! దాన్ని తిప్పటానికేగా! ఏమిటో ఆలోచనలు! పక్కకు ఒత్తిగిలి బలవంతాన కళ్ళు మూసుకు పడుకొంది పార్వతమ్మ.

* * *

కుంపటి ముందర కూర్చుని బరబరా విసురుతోంది రాధ. కుంపటిలో బొగ్గులు ఎర్రగామారి కణకణ లాడుతున్నాయి. వాటిసెగకు రాధ ముఖంనిండా చెమట పట్టింది. చెమటకు ఆమె ముఖంమీది ఎర్రటి తిలకం కరిగిపోయింది. పమిట కొంగుతో ముఖం తుడుచుకొని నిప్పుల వంక నిదానంగా చూసింది రాధ. అవి ఎర్రగా మిడిసిపడుతూ భగభగ మండుతున్నాయి గర్వంతో విర్ర వీగుతున్నట్లు. వాటి బతుకెంతసేపు? అయిదునిముషాలు పదినిముషాలు—మహా అయితే పదిహేను నిముషాలు. తరువాత మిగిలేది బూడిద. 'తన బతుకో' ఛీ ! ఏమిటి తనకేమయింది యిప్పుడు? అర్థంలేని ఆలోచనలు. మళ్ళీ బరబరా కుంపటి విసరసాగింది.

ఆ కుంపటి వెలుగులో రాధ మిలమిల మెరసిపోతోంది. కట్టుకొన్నది చిరిగిపోయినా ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. ఎర్రపరికిణీ, జాకెట్టు, తెల్ల ఓణీ మూడిట్లో చిరగనిదేదీ లేదు. ఆ పేదరికంతోటి అందం పోటీపడింది. ఎక్కడయినా పోటీ గెలుస్తానని ధీమాగా నిక్కి విరుసుకు నుంచుంది. [illegible] అందంతో తల్లి సహకారం రెండూ [illegible] గానీ. డబ్బున్నవాళ్ళకు వుండే తెలివితేటలూ వున్నాయి. డబ్బులేని తెలివి వుండి ఏం ప్రయోజనం? సద్వినియోగ పరచుకొనేందుకు అవకాశాలేవు. అవకాశం లేకపోతే ఏం — ఆలోచనలు పరుగెత్తుతున్నాయి పంచకల్యాణిలాగా — ఒక్కొక్కసారి తెగిన గాలిపటంలాగా. గుర్రానికి కళ్ళెం చేతిలోనే వుంచాలి. గాలిపటానికి దారం తెగకుండా వుండాలి. అందుకే చాలా జాగ్రత్త పడుతుంది రాధ. వెర్రి వెర్రి ఆలోచనలను రానివ్వదు. వచ్చినా వాటిని బలవంతగా పీకి అవతల పారేస్తుంది, అక్కరలేని కలుపు మొక్కలు తోటలోంచి పీకి అవతల పారేసినట్లు. అయినా ఆమెకూ ఆలోచనలు వస్తూంటాయి. ఆలోచిస్తూంటుంది. ఆహారం తీసుకోవద్దంటె పొట్ట వూరుకొంటుందా ? ఏపని చేయకుండా కూర్చోమంటే కాళ్ళూ చేతులూ వూరుకొంటాయా ? అలాగే మెదడుమాత్రం వూరికే ఎలా వుండగలుగుతుంది? ఇతర వ్యాపకాలు లేనప్పుడు ముఖ్యంగా వచ్చేవి ఆలోచనలే ! హైస్కూలు చదువుతోటి అన్ని చదువులు ముగిశాయి. ఎప్పుడో నెలకొకసారి పొరుగింటి వాళ్ళదగ్గర తీసుకు చదివితే ఒక వారపత్రిక — లేకపోతే అదీలేదు.

అన్నం వుడుకుతోంది కుతా కుతా. ఆవేదనాపరుడి మనసులాగా. మూత కొంచెం పక్కకు జరిగింది. ఆవేదన మనసులో నిలువలేక కార్యరూపంలోనో, వాక్రూపంలోనో బయటకు వచ్చేసినట్లు అన్నం పొంగి కుంపటిలో పడింది. రాధ విసురుతూనే వుంది. మండలేక ఆగలేక వున్నాయి నిప్పులు. చావలేక బతుకలేక వున్న రోగిలాగా. రాధ తొట్రుపడింది. చేతిలో విసనికర్ర అవతల పారేసి, గిన్నె దించి వార్చింది. మళ్ళీ కుంపటి మీదపెట్టి విసరటం మొదలుపెట్టింది. ఈలోపల కాస్త రాచుకొని మండసాగాయి నిప్పులు. మండుతున్న వాటివంకే చూస్తూ కూర్చుంది విసనికర్ర పక్కనపెట్టి. 'ప్చ' తనుకూడా చదువుకొన్నా బాగుండు'

అనిపించింది.

దానివల్ల ఏం లాభం? బ్రతుకు వంటింట్లో ఈ కుంపటికే అంకితమయి పోయింది. సుధ, ప్రమద అంతా కాలేజీలో చదువుకుంటున్నారు. తనే యిలా మిగిలి పోయింది. నిజానికి వాళ్ళందరికంటె తనకు ఎక్కువమార్కులు వచ్చాయి. అయితేయేం? సుధ నాన్నగారు ఆఫీసర్లు. ప్రమద నాన్నగారు ఆఫీసరు. వాళ్ళ నడక నోట్లకట్టలమీదే సాగిపోతూంటోంది. సుధది మొద్దుబుర్ర. ఒకపట్టాన తల కెక్కదు ఏది. అసలు చెప్పింది అర్థం చేసుకోలేదు. అయితేయేం! డబ్బుంది. ట్యూషన్లు పుష్కలంగా పెట్టారు. ఏ సబ్జెక్టు లెక్చరరు దగ్గర ఆ సబ్జెక్టుకి కాలేజీలో జరిగే పరీక్షలన్నిటికి, నిరాఘాటంగా పాసయిపోయింది. క్లాసు రాకపోయినా పి. యు. సి. పెద్దపరీక్షలో కూడా పాసయింది. అక్కడకూడా వాళ్ళ నాన్న ఏదో చేశాడంటారు. ఏంచేస్తేనేం? అదృష్టవంతురాలు. బి. ఎ లో కూడా చేరింది. తనేమో కాలక్షేపంకోసం చదువుతోందిట. వాళ్ళమ్మేమో పెళ్ళికోసం చదివిస్తోందిట. వాళ్ళనాన్నేమో తనమాట కాదనలేక తనిష్టప్రకారం చదివిస్తున్నాట్ట. పైకిమటుకు వాళ్ళమ్మతో పెళ్ళికోసం చదివిస్తున్నట్లుగానే చెబుతాడట. ఎంత సరదాగా చెబుతుందది ఈ కబుర్లన్నీ? విన్నకొద్దీ వినాలనిపిస్తుంది.

ప్రమదకు చదువుమీద శ్రద్ధలేదు. వాళ్ళనాన్న, అన్నయ్య బలవంతంమీద చదివిస్తున్నారట. 'నా ప్రాణానికి యిదెక్కడ తనో? ఇంకా ఎన్నాళ్ళో? ఆ బి.ఏ. డిగ్రీ వచ్చేవరకూ తప్పదు' అంటుంది. హాయిగా సంవత్సరం పొడుగునా సినిమాలు, షికార్లతో గడిపేస్తుంది పరీక్షలముందర ఆ గైడ్సు ముందర వేసుకొని, ముక్కున పట్టించుకొని దులిపేస్తుంది. 'హాయిగా తిని తిరిగేందుకు లేకుండా నా ప్రాణానికి యిదెక్కడి పీడో?' అంటూంటుంది. చక్కగాచదివిస్తూంటే చదువుకోటానికేం? అంటే, 'నీకేం అలాగే అంటావు స్వేచ్ఛా జీవివి కాబట్టి. నన్ను చూడు సంవత్సరం పొడుగునా దిక్కుమాలిన కాలేజి, పుస్తకాలు గొడవ, బ్రతుక్కి స్వేచ్ఛే తక్కువయి పోయింది. పొద్దున్న లేచి సాయంత్రం కాలేదు, ఇంటికి వచ్చినా, చదవకపోయినా వాళ్ళకోసరమైనా పుస్తకాలు ముందేసుకు కూర్చోవాలి. నాయిష్టప్రకారం చేయడానికి స్వేచ్ఛ ఎక్కడిది?' అంటుంది.

ఏమిటో విచిత్రం? ఉన్నవాళ్ళకు చదువుకోవాలని వుండదు. అదుంటె తెలివితేటలు వుండవు. చదువుమీద ఆసక్తి తెలివితేటలూ రెండూ వున్న వాళ్ళకు డబ్బుండదు. డబ్బుండి, చదువుకోవాలన్న ఆసక్తి కలిగి, తెలివితేటలున్నవాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు! నవ్వుకొంది. తనకుమటుకు యిప్పుడు ఏం తక్కువైనది? బ్రతుక్కి కావాల్సింది ఒక్క చదువేనా? తనని ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే అమ్మా—నాన్నా, తనలోనే ప్రాణాలు నిలుపుకొన్న అమ్మా—నాన్నా తన అరి కాల్లో ముల్లు విరిగితే గిలగిల లాడిపోయే అమ్మా—నాన్నా, తనభావి జీవితం సౌఖ్య ప్రదం చేయాలని చెప్పులు అరిగిపోయేలా తిరుగుతున్నాడు నాన్న. తనను మనసున్న మనిషికి యివ్వాలని ఆయన పులాటం. తనని ప్రైవేటుగా పి. యు. సి కి కట్టమని ఒకటి రెండుసార్లు అన్నాడు. ఎంత ప్రైవేటుగా చదివినా కొంత ఖర్చుకాక తప్పదు. అది పెడితే అమ్మకు నిక్షేపంలా మందు వస్తుంది. అమ్మకంటె తన చదు వెక్కువా?

అన్నం మాడువాసన కొడుతోంది. ఉలిక్కిపడ్డది రాధ ఎంతసేపటి నుంచి మాడుతోందో ఏమో! దిక్కుమాలిన ఆలో చనలు వచ్చినకొద్దీ వస్తాయి వరద సీటి లాగా. గిన్నె కుంపటి మెలుగుతో దించి, కిందపెట్టింది. గదంతా చీకటిగా వుంది. లైటు వేద్దామనిలేచి తలుపు పక్కనవున్న స్విచ్ దగ్గరకు వెళ్ళింది. తండ్రిగొంతు వినిపించి ఆగిపోయింది.

'లేదు సారూ! ఐదువేలు కట్నమిస్తా మంటె వచ్చి పిల్లను చూసుకొంటా మన్నారు. ఇంకెందుకు వృధాప్రయత్నం, తిరిగి వచ్చేశాను'

'కాస్తకూడా తగ్గనన్నారా?' నీరసంగా తల్లి గొంతుక.

'పిచ్చిదానా! ఎందుకు తగ్గుతారు? మనం కాదంటె అవతల యింకొకళ్ళు రెడీగావున్నారు పిల్లనివ్వడానికి. అందరూ మనలాంటివాళ్ళే వుంటారా? వాళ్ళు అడిగినంత యివ్వటానికి సిద్ధంగా వున్న వాళ్ళు ఎంతమందో? వాళ్ళముందర పోటీకి మన మెక్కడ నిలుస్తాం నీ పిచ్చి గాని!

'అయినా ఒక్కసారి వచ్చి పిల్లను చూసుకు వెళ్ళమనక పోయారా? దాన్ని చూశాకయినా వాళ్ళమనసు మారేదేమో!'

తండ్రి నవ్వు వినిపించింది. 'కేవలం పిల్ల అందచందాలకు ఆశపడి చేసుకొనే రోజులు గతించిపోయాయి. అదంతా మన భ్రమ. ఇప్పుడువస్సే కట్నం తరువాతే. వాళ్ళు కోరినంత కట్నమిస్తానన్నాక



# తపన

[illegible] చూస్తారు. అవి లేకుండా డబ్బున్న పిల్లను చేసుకుంటారు కాని అవివుండి డబ్బు లేకపోతే చేసుకోరు. అవి నచ్చకపోతే యింకో పోటికి వెడతారు. అన్నీ వున్నవాళ్ళు వుండకపోరుగా. అన్నీ వున్నవాళ్ళ పైలావచ్చినుగా కట్నాలు పుచ్చుకు ముందుకు వస్తూంటె అది మన బోటివాళ్ళ గొంతుకు బిగుసుకొంటోంది. ఉన్నవాళ్ళు యివ్వడం మానరు. ఇచ్చేవాళ్ళు వున్నప్పుడు యివ్వనివాళ్ళ దగ్గరకు వాళ్ళు రారు. ఇవ్వకపోతే వాళ్ళురారు కాబట్టి, యివ్వలేనివాడుకూడా ఆ బరువుకి తన నడుం విరిగిపోతున్నా తనూ ఎత్తుకున్నాడు. అందుకనే రోజులిలా వున్నాయి. బరువు మొయ్యలేనివాడు మొయ్యలేనని ఖచ్చితంగా చెప్పేసెయ్యాలి. చెప్పటంలేదు. నడుం విరగొట్టుకునయినా మోస్తున్నాడు. 'తరువాత మా నల్లో పడితే వద్దాతే' అనుకొని మోస్తున్నాడు. అంతంత బరువులు మేము మొయ్యలేమని నలుగురూ అని వదిలేసినప్పుడు వాళ్ళు తమ బరువంతా వాళ్ళ నెత్తిన పడితే మొయ్యలేరని తెలుసుకుంటారు. వీళ్ళు వాళ్ళ గాడిదలేం కారు కొట్టి మోయిస్తేమోనని భయపడటానికి!'

'ఏమిటో అంతా మీలాగే వుంటారా? దాని అదృష్టం ఎలావుందో యింతకీ' ఇంతలో పళ్ళెం దగ్గ పూపేరి సలపనివ్వలేదు!! రాధ వేడిగా శ్వాస విడిచింది. పరంధామయ్య వ్యక్తిత్వం మీద అపరిమితమైన గౌరవం పొందింది రాధకు. లైటువేసి కంచు గ్లాసుతో మంచినీళ్ళు తీసుకు యివతలకి వచ్చింది.

'హాయ్! ఈ పటికబెల్లం ముక్క నోట్లో వేసుకో తల్లి నోట్లో పటిక బెల్లం ముక్క వేస్తున్నాడు తండ్రి. అక్కడే కొంతెం దూరంగా మంచముంది.

తలెత్తి రాధను చూసిన పరంధామయ్య, 'మంచినీళ్ళు తెచ్చావా తల్లీ! అక్కడే మంచమ్మీదెం [illegible] అన్నాడు మమతతోని మంచితనాన్ని, మమతను ఆ [illegible] కలబడుతూ.

'ఇప్పుడేనా నాన్నా వస్తున్నావు' అడిగింది మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ. గ్లాసందుకొంటూ చూపిచ్చి వేయుపట్టి కళ్ళకు [illegible] 'విప్పు చేసు [illegible]

లేకుండా ఎప్పటికప్పుడు అన్నీ అందిచ్చేస్తుంటావు' అన్నాడు.

ఫకఫకా నవ్వింది రాధ 'అలసి యింటి కొచ్చిన వారికి మంచినీళ్ళు యివ్వాలని, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టాలని, రోగికి మందివ్వాలని, ఏడుస్తున్న పసి పిల్లల్ని బుజ్జగించాలని కూడా ఒకరు చెప్పాలా నాన్నా'

'నా తల్లి బంగారు తల్లికదూ! అందుకే చెప్పనక్కరలేదు' సంచిలోంచి జిలేబి పొట్లం తీసి అందిస్తూ అన్నాడు.

'చిన్నప్పుడు తెచ్చినట్లు నాకు ఇప్పుడు కూడా రోజూ యివెందుకు నాన్నా'

'అయితే నువ్వు మాకిప్పుడు పెద్దదానివయ్యావా?' నవ్వు దాచుకోలేక పోయింది రాధ. తండ్రితో శ్రుతి కలిపింది. వాళ్ళిద్దర్ని చూస్తున్న పార్వతమ్మ దిగులు, ఆయాసం అన్నీ మరచిపోయి చిరునవ్వుతో విచ్చుకొన్న పెదవులతో కళ్ళు మూసుకొన్నది.

రాధను చూస్తున్న పరంధామయ్య, 'ఈ నెలలోనైనా అమ్మాయికి మంచి బట్టలు కొనాలి,' వాక్యం చివర వరకూ వచ్చిన మాటను ఆపేశాడు. ముందు పార్వతికి మందు ముఖ్యం. అవి–యివీ అన్నీ తలకు మించిన బరువవుతాయి. పై నెలలో చూసుకోవచ్చు!' సర్ది చెప్పుకొన్నాడు.

'లే నాన్నా. స్నానం చేసిరా. భోంచేద్దాం అన్నం చల్లారిపోతుంది' రాధ మాటలకు 'అలాగే నమ్మా' అంటూ లేచాడు పరంధామయ్య.

* * *

'కాఫీ తీసుకో నాన్న' ఆఫీసు నుంచి వచ్చి అప్పుడే తల్లి మంచం మీద కూర్చున్న తండ్రికి కాఫీ తెచ్చిచ్చింది రాధ.

'అప్పట్లు మంచినీళ్ళు మరచిపోయా వివాళ' గ్లాసక్కడ పెట్టి వంటింట్లోకి పరుగెత్తింది. ఆ నవ్వుముఖం చూడగానే అలసట మరచిపోతాడు పరంధామయ్య.

మంచినీళ్ళ గ్లాసందుకొంటూ, 'అమ్మకు యివాళ ఎలా వుంది?' అడిగాడు.

'రోజూకంటె నయమే. దగ్గు ఆయాసం [illegible]

[illegible] వుంటారేది' అన్నాడు డాక్టర్ ఇంతకుముందే నిద్రపోయింది' అన్నది.

'దానికి నీ పెళ్ళిగురించి బెంగపెట్టుకొందమ్మా. ఏం చేస్తాం?' బాధగా అన్న తండ్రి మాటలకు, 'బెంగెందుకు నాన్నా దాన్ని గురించి. నువ్వెళ్ళి స్నానం చేసిరా. తువ్వాలూ, సబ్బు తెచ్చిస్తాను' అన్నది మాటమారుస్తూ.

తండ్రికి తువ్వాలు, సబ్బు అందిచ్చి, వంటింట్లోకి నడిచింది.

శనివారం. రాత్రికి చపాతీలపిండి కలిపి పెట్టింది. అప్పడాలక్కర, రాయి తెచ్చి కుంపటిదగ్గర పెట్టుకుంది. వేతిగిన్నెలో యింత మాసె వేసుకొని అదీ కుంపటిదగ్గర పెట్టుకొంది. పిండి వుండలు చేసిపెట్టుకొని, పెనంతెచ్చి కుంపటిమీద వాలేసింది. ఒక్కొక్కటి ఒత్తి కాలుస్తోంది. అవి చక్కగా పొంగుతున్నాయి. సంతోష సమయంలో పొంగే మనసులాగా. వాటిని చూసి సంతోషపడ్డది రాధ.

'నీకు అన్నం వండుకొన్నానా రాధా' వంటింట్లోకివస్తూ అడిగాడు పరంధామయ్య.

తలెత్తి తండ్రిని చూసి, 'స్నానం అయిపోయిందా నానా?' అని. 'నాకు పొద్దుటి అన్నం వుంది' అన్నది.

నుదుట విభూతి పెట్టుకొచ్చిన పరంధామయ్య, 'ఆ చిన్న గిన్నెనా? ఏదరా చాలుతుందమ్మా? కాసిని ఏరిస్తాను, రెండు పిడికిళ్ళు అవి కాగానే పడెయ్య వుడుకుతుంది' అన్నాడు.

'చాలు నాన్నా గిన్నెలో నాక్కెట్టాను. రెండు రొట్టెలు తింటాను' పెనంమీది చపాతీ తీసి పళ్ళెంలోవేస్తూ అన్నది.

'రెండు రొట్టెలు తింటే ఎక్కువవుతాయా? బియ్యం కడిగి పడేసుకో.'

'రొట్టెల్లో పప్పు వేసుకొంటావా' అడిగింది.

'వద్దమ్మా. పుట్టని తిరేసి కాసిని మజ్జిగ తాగుతాను'

'వంచుకోకూడదూ! పొద్దున్న బాగున్నదన్నావుగ'

'లేదమ్మా! వారానికొకపూట ఎలా తింటేయేం? ఒక్కపూట కూడా సరిపెట్టుకోలేక పోవటం చాలా బలహీనం కదమ్మా! వారానికొకపూట ఎలాగోలా

తినటం నేర్చుకోవాలి. అది తరువాత ఎప్పుడయినా అవసరమయినా బాధని పించదు. ఏమంటావు ?'

'నన్నే సమర్థిస్తంవావు నాన్నా. నేను వాటుకు వారాని కొకసూటు సరిపెట్టుకో లేనా ? ఇప్పుడా రెండు పిడికెళ్ల బియ్యం వండకపోతే ఏం ?'

రాధ ప్రతిసారి ఆలోచనలో, మాటలో తనని వడగొస్తూంటె అపరిమిత ఆనంద పడతాడు పరంధామయ్య.

'అది అందరికీ వర్తిస్తుంది నిజమే కాని, నువ్వింకా చిన్నపిల్లవేగా...' మధ్య లోనే అందుకొంటూ, 'ఇప్పట్నుంచే అల వాటు చేసుకొంటె సులభం నాన్నా' అన్నది.

'సీ ఇష్టం. నాకంటె చిన్నదానివయినా మా అమ్మలాగా కబుర్లు చెబుతూంటె నేనేం మాట్లాడను?' ముసిముసిగా నవ్వింది రాధ.

'అమ్మకేం పెడతావు మరి.'

'అమ్మకు నేతితో కాలుస్తా.'

'నువ్వుఒత్తు, నేను కాలుస్తా.' కుంపటి పక్కన పీటవేసుకు కూర్చున్నాడు పరంధా మయ్య.


'అయితే మీ అమ్మ నీచేత రొట్టెలు కాల్పించేదా నాన్నా' ఫక్కుమన్నది. తనూ ఫక్కుమన్నాడు.


పరంధామయ్యంటే రాధకు తండ్రన్న గౌరవం వున్నది. కాని తండ్రితో మాట్లాడుతున్నట్లు వుండదు. ఒక స్నేహితునితో మాట్లాడుతున్నట్లు వుం టుంది. పరంధామయ్య ఆశించినది అదే మాట్లాడింది ఎలాంటిదయినా అర్థం చేసుకొని సమానస్థాయిలో సమాధాన మివ్వ గలదు.

రాత్రి పడుకోబోయేముందర రాధవంక చూశాడు పరంధామయ్య. అప్పటికే గాఢ నిద్రలో వుంది. ఆటలతో అలసిపోయి విశ్రమించే పసిపిల్లలాగా వుంది. ఒక్క నాడు విసుక్కోకుండా తమిద్దరికి పసిపిల్ల లకు చేసినట్లు చేస్తుంది. ఈ భారాన్ని అవలీలగా మోస్తోంది. 'ఈ రాధా తనకు బరువు?' పరంధామయ్య మనసు గిజగిజ లాడిపోయింది నాకు నా రాధ బరువెప్పటికీ కాదు. నాయింట్లో నా సేవకు, నా స్వార్థా నికి వినియోగించుకోకుండా అది దాని బ్రతుకులో సాధువుని చవి చూడాలి నే


# సపట్ మలామ్

తామర, గజ్జి, విడుము
పాదములమీద మరియు వేళ్ల మధ్య పగుళ్లను,
పోగొట్టుటకు దివ్యమైనది.
SAPAT & CO., BOMBAY 2.
ఏజంట్లు: ... ట్రేడింగ్ ... ప్రతిష్ఠ
బకింగ్‌హాం పేట, విజయవాడ 2.

# ఫోస్ఫోమిన్,
శక్తిని వృద్ధిపొందించును
ఆకలిని అధికము చేయును
సహనశక్తిని
హెచ్చించును,
శరీరముయొక్క రోగనిరోధక శక్తిని
ఎక్కువ చేయును



అవును —
కుటుంబము అంతటికి
ఫోస్ఫోమిన్
వల్ల ఆరోగ్యము కలుగును.

ఫోస్ఫోమిన్... బి కాంప్లెక్స్ విటమినులు మల్టిపల్
గ్లిసరోఫోస్ఫేట్లుగల అనుపమైన మంచి రుచిగల టానిక్
SQUIBB® 
® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్, ఇన్కార్పొరేటెడ్ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు... 
SARABHAI CHEMICALS
shilpi sc 50/37 Tel.

నా అభిప్రాయం. [illegible] [illegible] ఈ ప్రయత్నం. పిల్లాపాపతో కళకళలాడు తూంటె చూడాలనే అభిలాష.

'ఇంకా పడుకోరేం? నిద్ర రావటం లేదా? పగలంతా ఒళ్లు హూనం చేసుకు వస్తే నిద్దరాక పోవటమేం?' రాధ పక్కనే మంచున్న పరంధామయ్యను చూసి అన్నది పార్వతమ్మ.

'నిద్రవస్తోంది. ఒకమాట చెబుదామని ఆ వెంట్రప్రగడలో ఏదో సంబంధం వున్నదట. వెంకయ్య చెప్పాడు. పిల్లాడు బాగానే వుంటాడట. వ్యవసాయం చేసు కొంటున్నాడు. చదువెంతోసరిగా తెలియదు. ఉండటానికి యిల్లువుంది. పొలంవుంది. సంవత్సరం పొడవునా ఏ బాదర బందీ లేకుండా సాగిపోతూంది. మిగిలే కొద్దో గొప్పో మిగుల్తుంది. తల్లిమొన్నీ మధ్యే పోయింది. ఒంటరిగాడు' అన్నాడు.

'కట్నం మేపాటిట'

'కట్నం మక్కరలేదు అంటున్నాడట. నేటి యువతరంలోను కొద్దిగా చలనం బయల్దేరుతోంది'

'అబ్బాయికి ఏ అవకరం లేదేమో ననుకొంటున్నారా?' సందేహంగా అడిగింది.

'ఏదో వంకరవున్నవాళ్లే కట్నం వద్దంటారా? మిగతావాళ్లంతా మనసులేనివాళ్లే అంటావా?'

'ఏమోనండి ఇంతకీ తోబుట్టువు లెవరూ లేరా?'

'అక్క, చెల్లెలు వున్నారు ఇద్దరూ పెళ్ళయి కాపురానికి వెళ్లారట.'

'చెల్లెలుకి కూడా పెళ్లయిందా? ఎన్నాళ్లయిందట పెళ్లయి?'

'అడుగలేదు అప్రస్తుతమని ఊరు కొన్నాను. నా చెల్లెలిపెళ్లిచేసి తరువాత నా పెళ్లి చేసుకోలేదూ?'

'అడగాల్సింది. వయసెంతన్నాడు?'

'కనుక్కోలేదయ్యా, మీ అమ్మాయికి సరిపోతాడు అన్నాడు'

'వయసుకూడా తెలీదా?' అని 'అయినా రేపోకసారి వెళ్లొస్తారా?' అన్నది భర్త ముఖంలోకి చూసి.

'అదే అనుకొంటున్నాను. కుర్రాడు చూస్తే మంచిమనసు కలవాడులా వున్నాడు. పిల్ల ప్రధానం కాని కట్నం ప్రధానంకాదు' అన్నాడుట.

# తపన

'మరే ఏ పుట్టలో ఏ పాముందో ఏం చెప్పగలం?' సన్నగా దగ్గు వచ్చింది. ఎక్కడో గడియారం పదకొండు కొట్టింది. 'పడుకోండి పొద్దున్నే లేవాలి' అన్నది.

లేచి పక్కమీద వాలాడు పరంధామయ్య.

* * *

నాన్న మళ్లీ ఏదో సంబంధం చూడటానికి వెళ్లాడట. శలవు రోజు వస్తే ఈ సంబంధాల కోసరమని కాళ్లకు కండెలు కట్టేలా తిరుగు తాడు విశ్రాంతి లేకుండా. అయినా తన కప్పుడే వయసేం ముంచుకుపోయిందని అంత తొందర? వద్దని, క్షణం తీరిక లేకుండా అలా తిరగవద్దని, యిలా వుండ టమే తనకెంతో ఆనందంగా వుందని ఎలా చెప్పటం ఈ నాన్నకు? 'అలా విశ్రాంతి లేకుండా తిరుగొద్దునాన్నా, నా పెళ్లి కిప్పుడేం తొందర?' అంటే, 'అది నా కర్తవ్యమమ్మా' అంటాడు.

కర్తవ్యం. ఏమిటీ కర్తవ్యం? తనూ ఒక ప్రాణి నన్నమాట మరిచిపోయి, తన శరీరం విశ్రాంతి వాంఛిస్తుందన్నమాట మరచిపోయి తిరగటం కర్తవ్యమా?

'రేపు పెళ్లయాక తమ పనీ యింతేనా?' నవ్వొచ్చిందా ఆలోచనకు రాధకు. అదెప్పటి సంగతి. ఇంకొక పాతి కేళ్లనాటి మాట. అప్పటికీ ఈ కాలం యిలాగే మారకుండా వుంటుందా? నిముష నిముషానికి మారుతున్న కాలం — ఇంకొక పాతికేళ్లనాటికి కూడా యిలాగే వుంటుం దని ఎలా అనుకోవటం? ఈ లోపల యువ తరంలో ఎంతో మార్పు రావచ్చు! ఇప్పుడు లోలోపల రాజుకుంటున్న ఈ బడబాగ్ని బద్దలయి ఈ కట్నం పిశాచం మాడి మసయి పోవచ్చు! వధూవరులు తలిదం డ్రుల చాటున కేవలం తోలుబొమ్మ లులాగా ఆడకుండా, తమ వ్యక్తిత్వం చాటుకొనే రోజు వస్తుంది. తమ స్వేచ్ఛను గుర్తిస్తారు. సాంప్రదాయాలనే మూర్ఖపు శృంఖలాలను త్రెంచుకొని బయటపడ గలరు. ఆడపిల్లను తమ గుండెల మీద కుంపటిగా భావించే తలిదండ్రులు అది తమ భ్రమ అని తెలుసుకో గలుగుతారు.

ఆడదంటె మగవాడి చేతులో కీలుబొమ్మ అనుకొనే రోజులు పోయి, కణకణలాడే నిప్పులాంటిదని తెలుసుకొనే రోజులు రావాలి. ఆడది తన వ్యక్తిత్వం తను చాటుకోవాలి. ఆడదాని వ్యక్తిత్వం గుర్తిం చాలి. ఈ సంసారపు జోడెద్దుల బండికి కట్టబడే రెండు ఎద్దులు సమానమే అని గుర్తించాలి. రెండు సమానంగా నడచి నప్పుడే బండి సరిగా నడవగలదు. వాటితో హెచ్చు తగ్గులు వున్నప్పుడు బండి సరిగా నడవదని తెలుసుకోవాలి. బండిని లాగటా నికి రెంటి బాధ్యత సమానమేనని తెలుసు కోవాలి. వివాహానికి మనసు — మమత ముఖ్యంగాని, వర్ణాలు, శాఖలు, డబ్బు కాదని గుర్తించాలి. భర్త భార్య కంటె అన్నివిధాల అధికంగా వుండాలన్న సంకుచితాభిప్రాయం మాసిపోవాలి. మనసుని మనసు అర్థం చేసుకొని రెండూ ఒకటిగా జీవించడమే వైవాహిక జీవితం అని గుర్తించాలి.

'అమ్మాయ్ రాధా!' తల్లి పిలుపుకి వులిక్కిపడ్డది రాధ. మళ్లీ ఆలోచనలు. ఒంటరిగా కూర్చుంటే వదిలిపెట్టవు. కిటికీ దగ్గరనుంచున్న రాధ యివతలకు వచ్చింది. 'ఎందుకమ్మా పిలిచావు? ఇంకా మందుకి వేళ కాలేదుగ! నువ్వు భోజనం చేస్తావా?'

'నా భోజనానికేం తొందర. నాన్నను రానివ్వు చేస్తాను. మధ్యాహ్నానికి వస్తానని చెప్పారుగా! నువ్వెళ్లి భోంచేయి. చిన్న పిల్లవి నువ్వెందుకు కనిపెట్టుకు కూర్చోటం' అన్నది పార్వతమ్మ.

'అదిసరేగాని ఎందుకు పిలిచావు?'

'ఆమాట చెప్పటానికే. పద నామాట విని నువ్వెళ్లి భోంచేయి' తల్లి గొంతులో తొణికిసలాడుతున్న వాత్సల్యానికి చలించింది రాధ. కాసేపు 'భోజనం ఒక్కరోజుకి ఆలస్యమయితే ఏం?' అనుకొంది.

'చేస్తానమ్మా ఒక్క పదినిమిషాలాగి' అని తండ్రి వస్తున్నాడేమో చూద్దామని వీధివాకిలి తలుపులు తీసింది. ఎదురుగుండా గొడుగు పుచ్చుకుని పరంధామయ్య నిలబడి వున్నాడు.

'నాన్న వచ్చాడు' చేతిలోని గొడుగు అందుకొని సంతోషంగా కేకేసింది. రాధ కేకకు కళ్లు విప్పిన పార్వతమ్మ ఏమయిం

తన్నట్టుగా ఆత్రంగా చూసింది భర్త ముఖంలోకి. వచ్చి భార్య మంచం పై కూర్చున్నాడు. రాధ మంచినీళ్లు తేవటానికి లోపలకు వెళ్లింది.

'రెండవ పెళ్లిట' అన్నాడు.

'రెండవ పెళ్లా?' పార్వతమ్మ నిర్ఘాంత పోయింది.

'అవును. వెంకయ్య ఆ విషయం చెప్ప లేదు. అక్కడికి వెళ్లాక తెలిసింది' అన్నాడు.

రాధ మంచినీళ్ల గ్లాసుతెచ్చి తండ్రి చేతి కందిచ్చింది. ఆమె ముఖంలోకి ఒక సారి చూసి గ్లాసందుకొన్నాడు పరంధా మయ్య.

'అయితే పిల్లని చూడటానికి రమ్మ న్నాలా?' ఆదుర్దాగా అడిగింది.

'ఎంత లేనివాడ్నిఅయితే మటుకు నా కడుపున పుట్టినదాన్ని నా వయసున్న వాడి చేతిలో ఎలా పెడతాననుకొన్నావు?' నవ్వాడు ఏదో అతీత లోకాలకు వెళ్ళినట్టు.

'ఏదో తొందరకొద్దీ అన్నాను' నొచ్చు కుంటున్నట్టుగా అన్నది పార్వతమ్మ.

'తొందరేముందిలే పారూ. నీ విధి విన్ను అడగమన్నది.'

'లే నాన్నా స్నానంచేసి భోంచేద్దు గాని, నీ కోసం అమ్మా నేనూ కని పెట్టుకు కూర్చున్నాం. దిక్కుమాలిన సంబంధం పోతే పోయింది పీడ' తండ్రికి తువ్వాలదిస్తూ అన్నది రాధ.

'నాకోసం కనిపెట్టుకు కూర్చున్నారా? ఎందుకు? వేళ్టకి భోజనం చేయకపోతే నీ ఆరోగ్యం ఎలా కుదుటపడుతుంది పారూ!' అంటూనే లేచి చకచకా స్నానానికి వెళ్లాడు.

ఆమాటలు పార్వతమ్మ వినలేదు. ఇదీ తప్పిపోయింది. దీని పెళ్ళెలా అవుతుంది? తనకది కళ్లారాచూసే యోగ్యం వున్నదా? ఏమిటో ఎలా రాసిపెట్టివుందో? పెద్దగా నిట్టూర్చింది పార్వతమ్మ, నీరసం ఎక్కు వయింది.

* * *

'పార్వతీ రేపు అమ్మాయిని చూసు కొనేందుకు వస్తున్నారు నేను రేపు మధ్యాహ్నంనుండి ఆఫీసుకి శలవుకూడా పెట్టాను'

'నిజంగా! ఇంతకీ అబ్బాయి ఏవూరు వాడు? మీకీ సంబంధం విషయం ఎవరు చెప్పారు? పక్కమీద లేచి కూర్చుంది పార్వ తమ్మ.

చొక్కావిప్పి మేకుకి తగిలించి భార్య పక్కన మంచం పై కూర్చున్నాడు. నా ఫ్రెండొకాయన చెప్పాడు. అబ్బాయి అతనికి తెలిసినవాడేనట. రేపు వాళ్లిద్దరూ కలసి వస్తామన్నారు.

'మీరుచూశారా అబ్బాయిని?'

'నిక్షేపంలా వుంటాడు. మనరాధ పక్కన నుంచుంటె చూడటానికి చక్కగా వుంటుంది'

'ఏపాటి అడిగాడేం?'

'పిల్ల నచ్చితే చాలన్నాడు. అసలా సభ్యతా సంస్కారాలు పిల్లాడి ముఖంలో తాండవిస్తున్నాయి పార్వతీ;'

'పిల్లనచ్చితే చాలన్నాడా? అయితే మన రాధ అదృష్టవంతురాలు' అప్రయత్నంగా అన్నది.

'నేనూ అదే అనుకొంటున్నాను ఇంతకీ రాధేదీ? నే వచ్చి యింతసేపయినా కనిపించ లేదేం?'

'మంచినీళ్లకు వెళ్లినట్టుంది. ఇంతకీ పిల్లాడికి వాళ్ల తల్లిదండ్రు లెవరూ లేరా? ఈయనతోకలిసి రావటమేం చూడ టానికి?'

'తండ్రిలేడట తల్లి, అన్నలు వదినలు ఆడపడచులు అందరూ వున్నారు వాళ్లంతా దూరంగా ఎక్కడో విశాఖలో వున్నారట. చేసుకొనేది అబ్బాయేకదా! అతనికి నచ్చితే చాలు. తరువాత వాళ్లవాళ్లకు తెలుప వచ్చునన్నాడు ఇంతవరకూ ఎన్నిసంబంధాలు వచ్చినా అతనసలు పిల్లని చూడటానికే వెళ్లలేదుట. ఇదే మొదటిసారి అతను పిల్లను చూడటం. పిల్లను చూచుకోమని చెప్పటానికి వచ్చినవాళ్లు చెప్పిన వివరాలే అతనికి నచ్చలేదట! 'అనవసరంగా దేనికి పిల్లను చూడటం, చేసుకోనివాడిని— ఇదేం జూ కాదు కదా! మనం చేసుకోము అని తెలిశాక వెళ్లటం అనవసరం' అన్నాడుట.

'ఏమిటినాన్నా యివాళ అప్పుడే వచ్చే శావు?' ముఖాన వంటిన అక్కడక్కడ చిందిన నీళ్లతో బిందె చంకన పెట్టుకు వచ్చిన రాధ అడిగింది లోపల అడుగు పెడుతూనే—


'మా రాధమ్మతల్లి ఒకయింటి దవ బోతోంది. ఆ మాట చెబుదామని'

'అయితే నే యింట్లో వుంటే మీకు బాగుండ లేదన్నమాట.' వంటింట్లోకి వెళ్లిపోతూ అన్నది.

నవ్వుకొన్నాడు పరంధామయ్య. పార్వ తమ్మ నవ్వింది.

* * *

'అమ్మా నువ్వెళ్లి పడుకోమ్మా. లే! పోతే అలా పీటవాసుకు కూర్చో. ఉట్టినే బరువెత్తితేనే ఆయాసమంటావు. గుండె



నొప్పి వస్తుంది: మంచిది కాదని. అలా కూర్చో నా మాట విని' కుంపటిముందర కూర్చుని ఫలహారం తయారు చేస్తున్న తల్లిని వుద్దేశించి అన్నది రాధ

'ఈ ఒక్కరోజూ పని చేయనివ్వు— ఏ నొప్పిరాదు. బ్రతికినన్నాళ్ళూ వుండే రోగానికి.'

'అలా మాట్లాడకు—ఇప్పుడేమయింది నీకు? ఇంకా కొద్ది రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి తగ్గిపోతుందని డాక్టరు చెప్పలేదూ? నువ్వేమో విశ్రాంతి తీసుకోవు. ఎలా తగ్గుతుందేం?' కసురుకుంది రాధ.

'కోప మెందుకమ్మా' అప్రయత్నంగా పార్వతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'పొగరుగా మాట్లాడి నీ మనస్సు నొప్పించానుకదూ ? క్షమించమ్మా. ఇంకెప్పుడూ అలా మాట్లాడను' రాధ గొంతు బొంగురుపోయింది.

రాధ తల నిమురుతూ 'క్షమించటమా ? ఈ అమ్మ దృష్టిలో రాధెప్పుడు క్షమార్పణ అడగవలసిన తప్పు చేయదు' అన్నది.

'నువ్వెళ్ళి ముందరగది వూడ్చేసి నీ పని కానిచ్చుకో పెందరాళే— ఈ లోపల నాన్న వాళ్ళను తీసుకు వస్తారు.'

ముందరగది వూడ్చి, పొరుగింటినుంచి తెచ్చిన రెండు కుర్చీలు వేసింది. పక్కనే యింట్లో వున్న మ్యాటు వేసింది. ఎదురుగుండా చాప పరచి యివతల గుమ్మం దగ్గరకు వచ్చి చూసింది. బాగానే వున్నట్లనిపించింది తల్లి మంచం అంతకు ముందరే దాట్లో పెట్టేసింది.

గుమ్మం దగ్గర అలికిడి అయి అటు తల తిప్పి చూసింది. తండ్రివెనుక అపరిచిత వ్యక్తులిద్దరూ వచ్చేసారు. చకచకా లోపలకు వెడుతున్న రాధ చెవిన పడ్డాయి పెద్దాయన అడుగుతున్న మాటలు—

'ఈ అమ్మాయేనా మీ అమ్మాయి?'

'అవునవును' అంటున్నాడు తండ్రి.

వెళ్ళి ముఖం కడుక్కువచ్చి, పండక్కి కొనుక్కొన్న గులాబి రంగు చీర, పల్లె జాకెట్టు వేసుకొని బొట్టు పెట్టుకొన్నది.

'వాళ్ళొచ్చేశారు—తొందరగా కానివ్వు' తొందరపెట్టింది పార్వతమ్మ

# తపన

పార్వతమ్మ గుండె వేగంగా కొట్టుకొంటోంది. ఈ సంబంధం ఖాయమైపోతే బాగుండు, దానికి మూడు ముళ్ళూ పడితే నిశ్చింతగా గడుపవచ్చు.'

'ఫలహారం పళ్ళెంలో పెట్టావా పార్వతీ' వరంధామయ్య లోపలకు వచ్చాడు.

'ఆ! ఆ! పెట్టా' పళ్ళెలు ముందుకు తోసింది,

ఫలహార పళ్ళెలు పట్టుకు వెళ్ళాడు వరంధామయ్య. తన కూర్చున్న మ్యాటు ముందుకు జరిపి దానిమీద పెట్టాడు. లోపలకు వెళ్ళేసరికి రాధ రెండు గ్లాసులతో మంచినీళ్ళు యిచ్చింది. కూతురి ముఖంలోకి చూసి నిండుగా నవ్వుతూ గ్లాసులు తీసుకువెళ్ళాడు వరంధామయ్య. తండ్రి నవ్వు చూసేసరికి నవ్వొచ్చింది రాధకు. తరువాత సిగ్గనిపించి తలవంచుకుంది. పార్వతమ్మ ఈ లోకంలో లేదు. యాంత్రికంగా పనిచేస్తోంది.

'రాధా నువ్వు కాఫీ పట్టుకురామ్మా' అన్నాడు వరంధామయ్య లోపలకువచ్చి. గిన్నెలో కాఫీ గ్లాసుల్లోపోసి, మూడు గ్లాసులు స్టీలు పళ్ళెంలో పెట్టుకుని, తండ్రివెనుకే అడుగులు వేయసాగింది.

'పార్వతీ నువ్వుకూడా రా'

'చేతులు కడుక్కు వస్తున్నా. అమ్మాయిని నన్ను తీసుకు రమ్మంటారా ?'

'ఒకళ్ళు తీసుకు వెళ్ళాలి ఏమిటమ్మా'

## ఉత్తరాలు రాసేవారికి మనవి

ఉత్తరాలు రాసేవారు ఈ క్రిందివి గమనించగోరుతాము.

—కవరులో ఇంగ్లీషు లిపి వాడరాదు.

—రాసేవారి పూర్తిపేరు చిరునామా ఉత్తరంలో ఉండాలి. అంతా తెలుగు లిపిలోనే ఉండాలి.

—అన్ని ఉత్తరాలూ వ్యక్తిగతంపేర కాక సంపాదకుడు, ఆంధ్ర పత్రిక వారపత్రికకి రాయాలి.

—సంపాదకుడు

కొరికింది రాధ.

'పదవదా నీ వెనకాలే నేనూ వస్తున్నాను' అన్నది. అప్పటికే గుమ్మం దాటాడు వరంధామయ్య. రాధ చేతిలోని కాఫీగ్లాసు అందుకొని, వాళ్ళిద్దరికి చెరొకటి యిచ్చి తనొకటి తీసుకున్నాడు.

రాధ చాపమీద కూర్చుంది. పార్వతమ్మ వచ్చి వంటింటి గుమ్మందగ్గర నుంచుంది. అమ్మాయిని చూశాక గుండె అదురు తగ్గింది. అతను తలెత్తి ఒకసారి పార్వతమ్మవంక చూశాడు. ఆ చూపులోనే పలకరింపు వున్నది.

అలాంటి చూపులు రాధకూడా చూసింది.

'ఏమన్నా అడగాల్సింటే అడుగు బాబూ' కూడా వచ్చినాయన అన్నాడు. ఏమీ అడగనక్కరలేదన్నట్లుగా తలపంకించాడు.

'యస్సెల్సీ పాసయింది. చదివిస్తే యింకా చదివేదేగాని నేనే చదివించలేకపోయాను' వరంధామయ్య అన్నాడు. అతను చిన్నగా నవ్వేడు.

'నీ పేరేమిటి బాబూ' పార్వతమ్మ అడిగింది.

తలెత్తి పార్వతమ్మవంక చూసి, 'రామకృష్ణ' అని 'నేనూ యస్సెల్సే పాసయ్యానండీ' అన్నాడు. ఏమనాలో తోచలేదు పార్వతమ్మకు.

'చదువు దేముంది ? ఆసాములయితే ప్రైవేటుగా కట్టి పాసవవచ్చు?' అని 'ఏమంటారు?' అన్నట్టుగా చూశాడు వరంధామయ్య.

'అవకాశం దొరికితే చదవాలని వుంది. ఈ సంపాదన చాలదు దానికి' నిర్మొహమాటంగా అనేసి నవ్వాడు.

కట్నమెలాగూ తీసుకోను కాబట్టి, అతని చదువుకి సాయపడాలి అనుకొంది పార్వతమ్మ. ఒప్పుకొంటేకదా! మళ్ళీ నిరాశ ఆవహించింది.

అతనంత నిర్మొహమాటంగా మాట్లాడుతూంటే రాధ హాయిగా నూపిరి పీల్చింది.

అతను లేచి నుంచుని, 'వెడదామా ?' అన్నాడు పక్కన వచ్చిన పెద్దమనిషితో.

'అలాగే. వెళ్ళొస్తాం వరంధామయ్య గారూ' ఆయనా లేచాడు. రాధ లేచి లోపలకు వెళ్ళబోయింది.

'ఒక్కమాట' అతనన్నాడు 'ఉద్యోగం

[illegible]

'లేదు' స్పష్టంగా సమాధానమిచ్చింది. హాయిగా నవ్వుకొన్నాడతను. రాధ పార్వతమ్మతో కలిసి లోపలకు వెళ్ళిపోయింది. పరంధామయ్య వాళ్ళను సాగనంపటానికి వాకిట్లోకి వెళ్ళాడు. చేసుకొనేవాళ్ళ వున్నాడు కాని, ఏమంటారో ఏం వినాల్సి వస్తుందో! పార్వతమ్మ చతికిల పడ్డది ఆయాసంగా.

'ఆయాస మొస్తోందామ్మా చెబితే విన్నావుకాదు!' ఆదుర్దాగా అన్నది రాధ.

'లేదు'

ముందరగది సర్దటానికి వెళ్ళింది రాధ.

ఇది నిశ్చయమైతే లక్షణంగా జరిపించాలి అమ్మాయిపెళ్ళి. ఈ కాస్త కొంప అమ్మితే మూడువేలన్నా రాకపోవు. పడమరకు తిరుగుతున్న తమ బ్రతుకులు ఎక్కడ వాలిపోయినా ఫరవాలేదు. అమ్మాయిపెళ్ళి ఏ లోపంలేకుండా సాగిపోవాలి. అతను కట్నం ఎలాగో తీసుకోవటంలేదు. వెండికంచం, గ్లాసు, వుంగరం, వీలయితే రిస్టువాచి కూడా కొనివ్వాలి. కట్నం పుచ్చుకొన్న వాళ్ళు మటుకు మన్నిస్తున్నారా? నేటి కవే 'చిన్నినా పొట్టకు శ్రీరామరక్ష' అని చెవులు మెలేసి గుంజుతున్నారు. అమ్మాయికి ఒక పట్టుచీరె కొనాలి. తనోక పట్టుచీరె, ఆయనొక పట్టుబట్ట కొనుక్కోవాలి. తన పెళ్ళి పట్టుచీరెతో యిన్నాళ్ళా గడిచిపోయింది. అమ్మాయి పెళ్ళికి ఒకటి కొనుక్కుంటె, శేష జీవితం సంతృప్తిగా వెళ్ళిపోతుంది దానిపేరు మీదుగా. ఏమిటో తొందరగా పెళ్ళిచేసెయ్యాలన్న వుబలాటమేకాని, అది వెళ్ళిపోతే యింట్లో తమిద్దరికి ఎలా తోస్తుంది? పార్వతమ్మ కళ్ళలో నీళ్ళు తిర్గిల్లాయి. నీరసంగా వెనక్కు గోడకు వాలి కళ్ళు మూసుకొంది. 'పార్వతీ, పార్వతీ' రెండంగల్లోవచ్చి వంటింట్లో పడ్డాడు పరంధామయ్య.

'అమ్మాయిని చేసుకొంటా నన్నాడు. తనకు నచ్చిందన్నాడు. ఇంకెవరితోను సంప్రతించవలసిన అవసరంలేదుట. వాళ్ళవాళ్ళకు వుత్తరం వ్రాస్తానన్నాడు. వాళ్ళన్నయ్య రాగానే ముహూర్తాలు పెట్టుకోవచ్చు! 'పిల్లనచ్చిందిచాలు కట్నంవద్దు' అన్నాడు— పెళ్ళికి ఆడపిల్ల తండ్రివని బయపడి

[illegible]

గొడ్డుపోలేదు పార్వూ! గంటకరాళ్ళతో రత్నంలా గాజు పెంకుల్లో వజ్రంలాగా, బురదనీటిలో వికసించిన పద్మంలాగా వున్నారక్కడక్కడ. మానవత యింకా పొంతం చచ్చిపోలేదు, కాదు కాదు—ఆ సమాధి తొంచే మళ్ళీ మానవత వుద్భవిస్తోంది. దానికి మన రామకృష్ణలాంటివాళ్ళే తార్కాణం. అదే అన్నాడు—మనిషికి మనసు ముఖ్యం. మనుగడకు కావాల్సింది మనసుని అర్ధం చేసుకోగల మనసు.

'రాధను చేసుకొంటానన్నాడు అదృష్టవంతురాలు నా తల్లిరాధ' మాట పొంతం కాకముందే పార్వతమ్మ ముఖంలో బాధ కనుపించింది. 'ఏమయింది? నొప్పి వచ్చిందా?' భార్యను పట్టుకొని ఆదుర్దాగా అడిగాడు.

'రాధా అమ్మకు మంచం వెయ్యమ్మా' కేకేశాడు.

తండ్రిమాటలు వింటూ భావి జీవితానికి పునాది కడుతున్న రాధ చేతిలో చీపురు అక్కడే వదిలేసి మంచంకోసం దొడ్లోకి పరుగెత్తింది.

'అమ్మాయికి పట్టుచీరె కొందాము. ఒక వుంగరంకూడా చేయిద్దామా...'

'ష్! మాట్లాడకు పార్వతీ అవన్నీ తరువాత మాట్లాడుకోవచ్చు!'

[illegible]

దాచుకోను? పింపొంగులా వస్తోంది. కన్నీటిలు తెంచుకొని వెల్లువత్తి ప్రవహిస్తోంది. పుట్టబోయే పిల్లలకోసమని తినీతినక అన్నట్లు ఈ యిల్లు కట్టాము. ఇంకెందుకు మనకీయిల్లు? అమ్మేద్దాము. లక్షణంగా విందుగా అమ్మాయి పెళ్ళి చేద్దాం.'

'అమ్మకు పక్క వేశానాన్నా,'

'నీ పెళ్ళికోసం పట్టుకొన్న రోగం నీ పెళ్ళికి పూర్తిగా నయమయిపోతుందమ్మా. నిన్ను పెళ్ళికూతుర్ని నేనే చేస్తా.' గుండె పట్టుకుంట పార్వతమ్మ ఒక్క మాటుగా.

'పార్వతీ! మాట్లాడవద్దంటె విన్నావు కాదు. నొప్పి బాగావచ్చిందా?' రెండు చేతులోను పార్వతమ్మను పైకెత్తబోయిన పరంధామయ్య చేతుల్లోనే పార్వతమ్మ మెడ పక్కకు వాలిపోయింది. 'పార్వతీ' పిచ్చిగా అరిచాడు పరంధామయ్య. పాలులోకి వెళ్ళబోతున్న రాధ ఆ కేకకు అదిరిపడి వెనక్కుతిరిగి చూసింది. తన పెళ్ళికోసం తపించిపోయి అది చూడకుండానే శాశ్వతంగా కన్నుమూసిన అమ్మవంక పోటమాటరాక చూస్తూ నుంచుండి పోయింది

